# కన్యపక్కలోని ఆ ఖడ్గం

★

అందే నారాయణస్వామి

[కథనుగురించి రెండుమాటలు-ఇది కేవలం కల్పితకథ కాదు. మా గ్రామంలో ఒకరి యింట్లో యీ ఖడ్గం వున్నది. దాన్ని ఆధారం చేసుకుని వ్రాశాను. కథాంతమున తెలిపిన ఖడ్గంయొక్క యిప్పటి రెండు వుపయోగాలుకూడా వాస్తవమైనవి. మా ప్రాంతంలో కొన్ని వర్ణాలవారు రజస్వల అయిన కన్యలకు స్నానం చేయించేటప్పుడు ఒక ఖడ్గాన్ని దగ్గరవుంచుతారు, రజస్వల అయిన పది రోజులవరకు కన్యపక్కలో ఒక కత్తిని కూడా వుంచటంకద్దు. పూర్వం తురుష్కుల ఏలుబడి కాలంలో వాళ్ళ దౌష్ట్యాలకు కన్యలు గురి కాకుండా వాళ్ళ రక్షణ నిమిత్తం యీ ఆచారం ఏర్పడ్డ దనుకుంటాను. అప్పటినుంచీ ఆ ఆచారమే కొన్ని వర్ణాలలో యిప్పటికీ లాంఛనంగా వస్తున్నది]—

నరసయ్య ఇంట్లో ఒక ఖడ్గంవున్నది. దాదాపు గజమున్నర బారు వుండి సామాన్యులు ఎత్త లేనంతటి బరువు వుంటుంది. ఆ ఖడ్గం ఎప్పటి నుంచి వాళ్ళ ఇంట్లో వుంటున్నదో నరసయ్యకు తెలియదు. అది పూర్వం ఏఆంధ్రవీరుడి హస్తాన్ని అలంకరించిందో. యర్రటి శతృరక్తంతో స్నానమాడిన ఆ కరవాలం నల్లటి తుప్పుతో కప్పబడి పోయింది. చక్కగా ఒరను తొడుక్కుని వీరుడి కటిసీమను అధిరోహించిన ఖడ్గరాజం ఒకమూల చిమ్మటలు, చిళ్ళపురుగుల మధ్య అజ్ఞాతవాసం చేస్తున్నది.—

నరసయ్య ఒక రోజున అనుకున్నాడుగదా గొడ్లచొప్ప నరుక్కునేటందుకు కత్తిదగ్గర యిబ్బందిగా వున్నది; ఇంట్లో వున్న ఖడ్గాన్ని చెడగొడితే బోలెడన్ని పనిముట్లు అవుతవి. పనిలో పని చొప్ప నరుక్కునే కత్తితోపాటు కూరలు తరుక్కునేటందుకు ఒక కత్తిపీట, గడ్డి దోక్కునేటందుకు రెండు దోకుడు పారలు చేయించాలని మనస్సులో అనుకుని మూలన వున్న ఖడ్గాన్ని ఒక పర్యాయం ఎత్తిచూసి దాని బరువుకు సంతృప్తిపడి రేపే దాన్ని కమ్మరివద్దకు తీసుకవెళ్ళాలని నిశ్చయించి ఆ రాత్రి మామూలు ప్రకారం భోజనంచేసి నిద్రపొయ్యాడు.

అతనియెదట ఒక భీకరమూర్తి ప్రత్యక్షమైంది. గుడ్డలన్నీ రక్తసిక్తములై వున్నవి. ఒక చేతిలో ఖడ్గం, మరోచేతులో డాలూ వున్నవి. కళ్ళవెంట అగ్నికణాలు రాలుతున్నవి. నరసయ్యకు ఆ మూర్తిని చూచేసరికి వణుకు పుట్టుకు వచ్చింది ఆ మూర్తి పెదాలు కదిలినవి. "నేనెవరినో నీకు తెలుసునట్రా? నీకు పూర్వీకుణ్ణి. వంశానుగతంగా నీకు పెట్టిందిగూడా నా పేరే! యీ ఖడ్గం నాదే. రాయలు కొలువులో సేనానిగా వుండి ఆఖరికు వీరస్వర్గం పొందాను. యీ నా కరవాలం ఎంతమంది శతృవులను పాదాక్రాంతులనుచేసి పౌరులచేత, రాజకుటుంబంచేత, ఎన్నిసార్లు మన్ననల నందుకున్నదో నీకేమయినా తెలుసా? కత్తి చేతపట్టి వంశగౌరవాన్ని నిలపలేకపోగా పైగా అటువంటి నా ఖడ్గాన్ని రూపుమాపదలచుకున్నావా చచ్చుపీనుగా? దాని జోలికి పో నిన్నేం చేస్తానో" అని గర్జించింది ఆ మూర్తి—

నరసయ్య నిద్రలోనుండి త్రుళ్ళిపడి లేచాడు, అప్పటికి తెల్లవారటానికి ఎంతో వ్యవధిలేదు. కలలో ఆ భీకరమూర్తిని చూసి దడుచుకోవడం వల్ల నరసయ్యకు రెండురోజులు జ్వరంవచ్చింది. ఆ దడుపు పొయ్యేటందుకుగాను నరసయ్య గ్రామంలోని వీరాంజనేయస్వామి గుడికి వెళ్ళి వారంరోజులు ప్రదక్షిణాలు చేసివచ్చాడు. దాని జోలికి పోతే ఆ భూతం ఎక్కడవచ్చి పీక నులిమివేస్తుందోనని ఆ ఖడ్గాన్ని చెడగొట్టే వుద్దేశాన్ని మార్చుకున్నాడు—

ఆ ఖడ్గం యిప్పుడు రెండు పనులకు వుపయోగపడుతున్నది. ఒకటి—గ్రామంలో కన్యలెవరైనా రజస్వల అయినప్పుడు లాంఛనంగా దాన్ని అడిగి పట్టుకువెళ్లుతూవుంటారు. రెండు, గ్రామదేవత కొలువుల్లో ఎవరో తాగి ఆ ఖడ్గాన్ని పట్టుకుని శివాలేస్తూవుంటారు—